సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భీమవరంలో వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో జరగబోయే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్‌బాడీకి చల్లా చంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ సభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు, గొర్రెల శ్రీను, కరకా వెంకట్రావు, శిరపు గణేష్, వరి జోగి బేతా అప్పారావు, వెన్నెల శ్రీను, మతల అచ్యుతరావు, గంట కోటి, సిరపు మహేష్, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రీసర్వే పనుల వేగవంతానికి చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు.. భూరక్ష పథకం కింద రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుండి రీసర్వే, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం తదితర అంశాలపై సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జాషువా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. నోటిఫికేషన్ అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియను సకాలంలో చేపడతామన్నారు. జిల్లాలో రీసర్వే పనులు త్వరితగతిన చేపట్టేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.

గొడౌన్ల లక్ష్యాలు సాధించాలి

రాష్ట్రంలో ఫేజ్-3 కింద నిర్మించనున్న మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ గొడౌన్ల లక్ష్యాలను సాధించాలని సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఆదేశించారు. గురువారం అమరావతి నుండి ఎంపిఎఫ్‌సి, బిఎంసియు (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్), ఎఎంసియు (ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్స్) నిర్మాణాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేజ్-1, 2వ విడతలో మంజూరు చేసిన నిర్మాణాలు దాదాపు పూర్తవుతున్నాయన్నారు. ప్రస్తుతం మూడో విడతలో 140 ఎంపిఎఫ్‌సి గొడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, దీనికి స్థల సేకరణ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. స్థల సేకరణలో సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కొత్త జిల్లాల్లో నిర్మించబోయే బిఎంసి, ఎఎంసి యూనిట్లకు సంబంధించిన స్థలాలను కూడా గుర్తించి వివరాలను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, జిల్లా సహకారశాఖ అధికారి ఎం.రవికుమార్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లాగా పోలవరం

- 'ఉమ్మడి పశ్చిమ'లో 2014 పునరావృతం
- బిసిలకు ప్రత్యేక నిధులేవీ
- పోలవరం ప్రాజెక్టును చూడాలని చంద్రబాబు పట్టు
- అడ్డుకున్న పోలీసులు..
- రోడ్డుపైనే బాబు బైఠాయింపు
- ఏలూరు జిల్లాలో ముగిసిన చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, కొయ్యలగూడెం, పోలవరం

పోలవరం మండలాలన్నింటినీ కలిపి ప్రత్యేక జిల్లాగా చేస్తానని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 స్థానాలు టిడిపి, మిత్రపక్షం గెలుచుకుందని, ఇప్పుడు మరోసారి అదే పునరావృతం కానుందని, వైసిపికి ఒక్కసీటు కూడా రాదని ఆయన తెలిపారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో గురువారం రెండోరోజు పర్యటన కొయ్యలగూడెం, పోలవరం మండలాల మీదుగా సాగింది. ఉదయం 11.30 గంటలకు నరసన్నపాలెంలోని దండమూడి రామలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బిసి నాయకులతో ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించారు. ముందుగా తూర్పుకాపు, గౌడ, శెట్టిబలిజ, యాదవ, కొప్పువెలమ, వడ్డి, కుమ్మరి, రజక, ఉప్పర, విశ్వబ్రాహ్మణ సామాజిక తరగతులకు చెందిన నాయకులు మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఏలూరు పార్లమెంట్ స్థానాన్ని బిసిలకు కేటా యించాలని, ఏలూరు జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు బిసిలకు కేటాయించాలని కోరారు. ఆదరణ పథకం కొనసాగించాలని, కల్లుగీత కార్మికులకు చెట్లు నాటుకునేందుకు భూమి కేటాయించాలని పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టిడిపికి బిసిలు వెన్నుముకని అన్నారు. పశ్చిమలో అన్ని స్థానాలనూ మరోసారి గెలుచుకుంటామన్నారు. బిసిలు ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా ఎదగలన్నారు. 54 సాధికారిక కమిటీలను ఏర్పాటు చేసి బిసిల సమస్యలను తెలుసుకుని, ఏం చేయాలో నిర్ణయిస్తామన్నారు. అందరికీ ఇచ్చే కార్యక్రమాలు కాకుండా బిసిలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా చేశారన్నారు. కీలకమైన అన్ని పదవులనూ రెడ్లకు కట్టబెట్టారన్నారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 20 శాతం కేటాయింపులు చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం 39 మంది బిసి నేతలను పొట్టనబెట్టుకుందన్నారు. 650 మందిపై కేసులు పెట్టారన్నారు. వైసిపి ఆఖరి గడువు దగ్గర పడిందని హెచ్చరించారు.



కొయ్యలగూడెం రోడ్‌షోలో మాట్లాడుతున్న చంద్రబాబు



బిసిల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

పోలవరంలో ఉద్రిక్తత

బిసిలతో సమావేశం ముగిసిన తర్వాత చంద్రబాబు తన పర్యటనను సాగించారు. బయ్యన్నగూడెంలో చంద్రబాబుకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడ నుంచి కొయ్యలగూడెం చేరుకున్న చంద్రబాబు సెంటర్లో మాట్లాడారు. వైసిపిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పోలవరం నిర్వాసితులకు పది లక్షల ప్యాకేజీ, భూములకు రూ.ఐదు లక్షలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. మాటలకు.. చేతలకు పొంతన లేదన్నారు. ఇంతలో మద్యం తాగిన వ్యక్తి అక్కడే పడిపోగా, ఇదే నిదర్శనమని, జగన్ ఇలాంటి మద్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులు అతన్ని తీసుకు వెళ్లి మంచినీళ్లు పట్టించాలన్నారు. 'జగన్ రావడం మా అదృష్టం' అంటూ కొయ్యలగూడెంలో కొంతమంది వైసిపి కార్యకర్తలు ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేశారు. అన్నా క్యాంటీన్లు మళ్లీ ప్రారంభిస్తామన్నారు. అనంతరం దిప్పకాయలపాడులో చంద్రబాబు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు ముందుకు సాగారు. కన్నాపురంలో పెద్దఎత్తున జనం చేరడంతో చంద్రబాబు మాట్లాడుతూ గోరంత ఇచ్చి కొండంత దోచేస్తున్నారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం అంతా ఆలోచించాలన్నారు. అక్కడ నుంచి ఎల్ఎన్‌డిపేట మీదుగా చంద్రబాబు పోలవరం చేరుకున్నారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా అప్రమత్తయ్యారు. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుకు బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాలను సైతం అడ్డంగా నిలిపారు. పోలవరం చేరుకున్న చంద్రబాబు ప్రాజెక్టు వద్దకు వెళ్తానని పట్టుబట్టారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మావోయిస్టుల ప్రమాదం ఉందని, వారోత్సవాలు జరుగుతున్నాయని, రాత్రి అయ్యిందని పోలీసులు తెలిపారు. తనను ఎప్పుడు వెళ్లమంటారని పోలీసులను చంద్రబాబు నిలదీశారు. అరగంటపాటు పోలవరంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం జీపుపైకి చేరుకుని సభలో ప్రసంగించారు. పోలవరంను చిదిమేశారని, తాను కట్టిన ప్రాజెక్టు వద్దకు తనను వెళ్లనివ్వకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు, రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటన సాగించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన సాగనుంది. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

ఎన్నికల అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

పోలింగ్ స్టేషన్లవారీగా ఓటర్ల జాబితా అప్‌డేట్ చేసి, తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎలక్ట్రోరల్స్ స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఓటర్ల జాబితాలో ఇపి రేషియో, జెండర్ రేషియో సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. డెత్ రిజిస్టర్, డెత్ సర్టిఫికెట్లు ప్రకారం చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఫారం 6, 7, 8కు సంబంధించిన క్లెయిములను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు ఉంటే వాటిని వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు నిర్దేశించిన శిక్షణను కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో డిసెంబర్ 3, 4 తేదీల్లో ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణకు ప్రత్యేక క్యాంపు నిర్వహించాలన్నారు. ఓటు నమోదుకు దరఖాస్తు స్వీకరణతోపాటు, ఓటరుకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింటు కలెక్టర్ జెవి.మురళీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎం.సూర్యతేజ (నరసాపురం), దాసి రాజు (భీమవరం), ఎ.దుర్గేష్ (తాడేపల్లిగూడెం), వి.ఆదిశేషు (ఆచంట), ఎం.రవికుమార్ (ఉండి), అప్పారావు (పాలకొల్లు), మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

డిఎస్ఎకు వినతి పత్రం అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని, క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము కోరారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డిఎస్ఎ) అధికారి సురేందర్‌కు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్దరాజుతో కలిసి రాము గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియంలో నిర్మించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో క్రీడలకు తగిన నిధులు కేటాయించి క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కొండ్రోతు మోహన్ కృష్ణ, నౌకట్ల చైతన్య, అల్లు మణికంఠ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పొగాకు పూర్ణ

హింస లేని సమాజ నిర్మాణానికి కృషి

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మజ, పి.పూర్ణ

ప్రజాశక్తి - భీమవరం

హింస లేని సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మజ, పి.పూర్ణ పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యాన స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో పూర్ణ మాట్లాడుతూ మహిళలకు విద్య, ఉద్యోగం, సమాన వేతనాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇవేమీ లేకుండా సమానత్వం అసాధ్యమని అన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పురుషులతో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, సామాజిక మాధ్యమం, వెబ్‌సైట్లు మహిళలపై హింసను ప్రేరేపించేలా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు తమ వ్యాపారం కోసం మహిళలను వ్యాపార వస్తువుగా చిత్రీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, ఐద్వా నేతలు వరలక్ష్మి, ఉదయకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టు అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, డిఎ అరియర్స్, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని విజయవాడ ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.650 కోట్లు మార్చి 2022 నాటికి క్లియర్ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో ఆర్థిక శాఖాధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే నేటి వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. మంజూరైన పిఎఫ్ తదితర లోన్లు జమ చేయకపోవడం, సిపిఎస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడం, రిటైర్ అయిన వారి బెనిఫిట్స్ చెల్లించకపోవడం వంటి సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిస్తే ఉపాధ్యాయులను ముందస్తు అరెస్టులు చేయడం దారుణమని పేర్కొన్నారు. పాలకొల్లులో రామభద్రం, క్రాంతిని హౌస్‌అరెస్టులు చేయడం, భీమవరంలో గోపీమూర్తిని పోలీసు స్టేషన్లో నిర్బంధించడం అన్యాయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు మానుకుని హామీ ఇచ్చినట్లుగా ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆందోళనలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు.

పారదర్శకంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రతిఒక్క అర్హునికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదే అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు అన్నారు. గురువారం ఎన్ఆర్‌పి అగ్రహారంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పివిఎల్ నరసింహారాజు పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో.. లేదో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విశ్రాంత జవాన్ యర్రా సింహాచలం ఉద్యోగంలో ఉండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, దాని కారణంగా ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చిందని తెలిపారు. తన పరిస్థితి రీత్యా తనకు తెల్ల రేషన్ కార్డు ఇప్పించాలని అధికారులను అడగగా ఇప్పటివరకు స్పందన లేదని పివిఎల్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులను సింహాచలం సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఉపసర్పంచి కడలి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, నేతలు విప్పర్తి మాణిక్యాలరావు, గలావిల్లి ధనుంజయ, మునుకోలు సింహాచలం, గుండాబత్తుల సుబ్బారావు, రణస్థల మహంకాళి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

నిబంధనలకు విరుద్ధంగా భూముల రిజిస్ట్రేషన్ చేసిన మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబును గురువారం అరెస్టు చేశామని సిఐ వి.సురేష్‌బాబు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత రెండు నెలల్లో మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత భూములు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై సబ్ కలెక్టర్ సూర్యతేజ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెల 25న తనిఖీలు నిర్వహించారు. 26న జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ కూడా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో 48 రిజిస్ట్రేషన్లు నిబంధనలకు విరుద్ధంగా సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబు చేసినట్లు తేలింది. దీనిపై తహాశీల్దార్ అనిత కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.వీరబాబు కేసు నమోదు చేశారన్నారు. సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

కల్లుపాకను తొలగిస్తే సహించబోం

ప్రజాశక్తి - ఆచంట

అధికారులు గీత కార్మికుని కల్లు పాకను తొలగిస్తే సహించబోమని కల్లు గీత కార్మిక సంఘం, ప్రతినిధి బృందం, కౌలు రైతు సంఘం నేతలు తెలిపారు. ఆచంట వేమవరం శివారు కల్లుపాక వివాదం గత కొద్దిరోజులుగా జరుగుతున్న విషయం విదితమే. గురువారం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహ మూర్తి, ప్రతినిధి బృందం బొంతు శ్రీను, ఆరేపల్లి వెంకట సత్యనారాయణ, దొంగ నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేతా గోపాలన్ కల్లుపాక చుట్టు పక్కల పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులను, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్లుపాక చుట్టూ ఉన్న రైతులకు గానీ, పొలాలకు వెళ్లేవారికి గాని ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పారని తెలిపారు. 40 సంవత్సరాలుగా ఉన్న కల్లుపాకను తొలగించాలని ఆక్వా చెరువు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు పున్ణపరిశీలన చేయాలన్నారు. గీతకార్మికుడు బొంతు పెద్దిరాజుపై కక్ష సాధింపు చర్యలు చేయరాదన్నారు.

తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డుకు రూ.1,280 కోట్లు జమచేయాలి

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కాళ్ల

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1,280 కోట్లు తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు అన్నారు. తహాశీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర కన్స్ట్రక్షన్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహాశీల్దార్ ఎ.కృష్ణారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల ఉపాధ్యక్షులు పి.మధుసూదనరావు, నాయకులు ఎం.బాబి, జి.మాణిక్యాలరావు, వడ్డే రాజు, జయంతి రాము, కొల్లి సతీష్ పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా వెంటనే సంక్షేమ బోర్డుకు జమ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలిండియా బిల్డింగ్ వర్కర్స్ డిమాండ్ డే సందర్భంగా కనకదుర్గా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం పంచాయితీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలుచేయొద్దంటూ పలు జిఓలు విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జిఒ 1214ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కేతా నాగాంజనేయులు, తానేలంక లక్ష్మీనారాయణ, కొమ్ముల గోపాలకృష్ణ, ఎస్.సత్తిపండు పాల్గొన్నారు

లబ్ధిదారులకు భూ హక్కుల పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. గురువారం మార్టేరు రెడ్డి కళ్యాణ మండపం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం లబ్ధిదారులకు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు, నరసాపురం సబ్‌కలెక్టర్ మల్లవరపు సూర్య తేజ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న వారికి త్వరలోనే సర్వే పూర్తి చేసి ఇళ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 526 మందికి పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం భూ ఆధారిత కారణంగా కుటుంబాల మధ్య వైరం కలుగుతోందన్నారు. ఈ పథకం ద్వారా ఏ యజమానికైనా తన స్థలం వేరొకరు ఆక్రమించుకోవడానికి వీల్లేకుండా ఈ సర్వే చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్టేరు, నెగ్గిపూడి సర్పంచులు మట్టా కుమారి, మామిడిశెట్టి ధనలక్ష్మి, ఆచంట ఎఎంసి ఛైర్మన్ జిల్లె లావణ్య, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు, సబ్‌కలెక్టర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

వాలీబాల్ పోటీల్లో విజేతలు వీరే

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో తణుకు (బాలురు) టీమ్ మొదటి స్థానం, ఆచంట (బాలురు) టీమ్ రెండో స్థానం సాధించారు. మహిళా విభాగంలో ఉండి టీమ్ మొదటి స్థానం, తణుకు టీమ్ రెండో స్థానం సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బి.జాన్సన్, వ్యాయమ పాఠశాల జిల్లా అధ్యక్షులు కర్రి కృష్ణా రెడ్డి తెలిపారు. విజేతలకు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు షిల్డ్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తణుకు కోచ్ ఎస్ఆర్.అప్పారావు, కెవిఆర్ సుబ్బారావు, స్టేట్ వాలీబాల్ రిఫరీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

తాజా కూరగాయలతో భోజనం వండాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండాలని ఎంపిపి మక్కా సూర్యారావు అన్నారు. గురువారం అత్తిలిలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి తిన్నారు. అనంతరం మెనూ ప్రకారం విద్యార్థులకు అన్నం, ఆకు కూర, గుడ్డు, చిక్కీ అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు రాత నైపుణ్యం మరింత మెరుగు పర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థీ విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ హాబీబుద్దిన్, అత్తిలి గ్రామ సర్పంచి గంట విజేత పాల్గొన్నారు.

వైసిపి నేత కె.ప్రసాదరాజు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దగ్గులూరు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కమ్మిలి ప్రసాదరాజు అనారోగ్యంతో గురువారం మరణించారు. ఈ సందర్భంగా జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రసాదరాజు పార్టీకి ఎంతో అండగా ఉండేవారన్నారు. ఆయన వెంట జెడ్పిటిసి నడపన గోవిందరాజు నాయుడు, పోడూరు జెడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు, పనతుల చంటి ఉన్నారు.

క్విజ్ పోటీల్లో లిల్లీ జాయిస్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థిని లిల్లీకి బహుమతి ప్రదానం చేస్తున్న జెసి అరుణ్‌బాబు

ఏలూరులో డిఎంహెచ్ఒ, డిస్టిక్ ఎయిడ్స్ కంట్రోల్ ఆధ్వర్యంలో గత నెల 18న ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లాస్థాయి స్థాయి క్విజ్ పోటీల్లో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని గోడి లిల్లీ జాయిస్ ప్రథమ స్థానం, డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని లిఖితపూడి జోషిత ద్వితీయ స్థానం సాధించారు. గురువారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, లోక్ అదాలత్ న్యాయమూర్తి రాజేశ్వరి చేతుల మీదుగా విద్యార్థినులు మెమెంటో, నగదు ప్రోత్సాహం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినులను ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి, స్టాఫ్, బోటనీ అధిపతి వై.విజయ్ కుమార్, విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి - తణుకురూరల్

బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యార్థులు విలువైన సమయాన్ని కోల్పోతున్నారని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి, జనాభా లెక్కల నుంచి విముక్తి కలిగించినందుకు ఎపిటిఎఫ్ హర్షం వ్యక్తం చేస్తుందని తెలియజేశారు. నాడు-నేడు వంటి విద్యేతర కార్యక్రమాలు చేపట్టడం, మరుగుదొడ్ల ఫొటోలు తీయించడం, మధ్యాహ్న భోజన పదార్థాల ఫొటోలు తీయించడం తదితర బోధనేతర పనులు ఉపాధ్యాయులతో చేయించడం వల్ల విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతుందని తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. గురువారం మొగల్తూరు సచివాలయం మూడులో ఫామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు దినేష్, డాక్టర్ సుబ్బారావు పలువురిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సావిత్రి,హెల్త్ అసిస్టెంట్ సాంబశివరావు, హెల్త్ సెక్రటరీ సునీత, డిఎ వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలవెలబోయిన టిడిపి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి కార్యకర్తల ఒక్కరోజు శిక్షణ తరగతులు ఉండిలోని కూనపరాజు సీతమ్మ అప్పలరాజు కళ్యాణ మండపంలో రాబిన్ సింగ్ బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే కార్యకర్తలు లేచిబయటకు వెళ్లిపోవడంతో ఆడిటోరియం కార్యకర్తలు లేక వెలవెలబోయింది. ఈ సందర్భంగా రాబిన్ సింగ్ బృందం మాట్లాడుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు 45 రోజులపాటు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వారి అభిప్రాయ సేకరణ చేసి వారి అభిప్రాయాలను ఇదేం ఖర్మ పత్రం రూపంలో పార్టీ ఆఫీసుకు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌ఛార్జిల పర్యవేక్షణలో జరిగేలా స్థానిక శాసనసభ్యులు చూడాలని తెలిపారు. అనంతరం శాసనసభ్యులు మంతెన రామరాజు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పిలుపుమేరకు వచ్చే 45 రోజులు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరుగుతుంటే కార్యకర్తలు, నాయకులు ఆడిటోరియం బయటకు వెళ్లిపోవడం గమనార్హం.

లారీ నుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోడూరు

ప్రమాదవసాత్తూ లారీ నుంచి కింద పడి మత్స్య వ్యాపారి మృతి చెందిన ఘటన కవిటం లాకు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన పోతాబత్తుల నరసయ్య (45) నరసాపురం మార్కెట్ నుంచి చేపలను తీసుకొచ్చి విక్రయిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున తీపర్రు నుండి కొంతమందితో కలిసి నరసాపురం వెళ్లి చేపలను కొనుగోలు చేసుకుని తిరిగి ప్రయాణంలో లారీ ట్రక్కులో కూర్చుని వస్తున్నాడు. ఈ క్రమంలో కవిటం లాకు ఒఎన్‌జిసి రింగు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ హైడ్రాలిక్ జాకితో ట్రక్కును పైకి లేపడంతో నర్సయ్య జారిపడి రోడ్డు మీద పడ్డాడు. ఈ క్రమంలో తలకు బలంగా గాయమై నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు రాము ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ జెజి.విక్టర్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్

సమాజంలో మహిళలు, పిల్లలపై ఎక్కువగా అత్యాచారాలు జరుగుతున్నాయని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ అన్నారు. గురువారం ప్రాజెక్టు కార్యాలయంలో మహిళలు, సమాజం, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ ఎలిజిబెత్ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు నిరోధించాలన్నారు. అత్యవసర సమయంలో హెల్ప్ లైన్ నంబర్లు 181, 112, 1098లను సంప్రదించాలని సూచించారు. అనంతరం తణుకు న్యాయవాది బాబ్జీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్.కాంతకుమారి, ఎం.శ్రీదేవి, ఎస్.వెంకటలక్ష్మి, కె.సుజాత, ఆర్.నాగలక్ష్మి, జి.ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: బాల్య వివాహాలు చట్టం రీత్యా నేరమని ఇరగవరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.కాంతకుమారి అన్నారు. ఇరగవరం మండలం ఈస్టువిప్పర్రు ఎస్ఆర్ హైస్కూల్లో హెచ్ఎం పి.ఉషశ్రీ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలను నిరోధించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాంత కుమారి బాల్య వివాహాలు చేస్తే వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఆడవాళ్లపై జరుగుతున్న అత్యాచారాలు, విద్యార్థులకు మంచి, చెడు స్పర్శల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణ గౌరీ, ఇంద్రజాదేవి, అంగన్వాడీ టీచర్లు అమరావతి, విజయలక్ష్మి, జయలక్ష్మి, సుభాషిణి, పద్మావతి, విజయ, మంగతాయారు, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళ్ల: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని సిడిపిఒ రత్నకుమారి పేర్కొన్నారు. గురువారం కోపల్లె హైస్కూల్లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రత్నకుమారి మాట్లాడుతూ పిల్లలకు చదువుకునే సమయంలోనే చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యాహక్కు, బాల్య వివాహాల చట్టం, మహిళలకు గృహ హింస చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణకుమారి, నరసమ్మ, శ్యామల, మేరీ మాతా పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ వ్యాధి పట్ల అపోహలు వీడి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు అన్నారు. భీమవరంలో ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం కేంద్రాల్లో ఆర్ట్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఎ ఏడాది 1,42,620 మందికి ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించగా 23 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెనుగొండ : సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ పి.రుచిక ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రుచిక మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

తణుకురూరల్ : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటు పడాలని బిసి కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. గురువారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఎఆర్‌టి సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శివప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం తమ్మయ్య ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ దేశం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తణుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) కార్యదర్శి బి.రమేష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు, డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, బంగారు రవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దాట్ల సుందరరామరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : వీవర్స్ కాలనీ అర్బన్ పిహెచ్‌సి పరిధిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి జాన్ లియో మాట్లాడుతూ ప్రపంచ దేశాల ప్రాణాంతక వ్యాధి ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ ఒకటిన ఎయిడ్స్ డేగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గుడ్ ల్యాంప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తాలూకాఫీస్ సెంటర్ నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాడేపల్లిగూడెం సివిల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ ముగింపును అడ్డుకునే అసమానతలను అంతం చేయడానికి అందరూ ఏకం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ ల్యాంప్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.అశోక్ కుమార్, కోఆర్డినేటర్ బి.చెన్నంరాజు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది, ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని ఎయిడ్స్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించారు.

పాలకొల్లు : ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లికార్జున మాట్లాడుతూ హెచ్ఐవి భూతం చాప కింద నీరులా విస్తరించిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లవైపు మరలకుండా చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ ఉపాధ్యాయిని ఎం.అంజలి, బయో కెమిస్ట్రీ అధ్యాపకులు ఎ.ఆమని పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పిహెచ్‌సి సిబ్బంది ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ చేశారు. వైద్యులు దినేష్, దివ్యభారతి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు తెలియజేస్తూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సావిత్రి, హెల్త్ అసిస్టెంట్ సాంబశివరావు, హెల్త్ సెక్రటరీ సునీత పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి టాక్సీ స్టాండ్ వరకూ ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, మేనేజ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ వి.మాణిక్యాలరావు, మెకానికల్ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ బుల్లి రాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ ఎయిడ్స్ డేను స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విచ్చేసి మాట్లాడారు. ఎయిడ్స్ రోగులు ధైర్యంగా ఉండాలి, క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వి.ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వ్యాధిగ్రస్థులు తగ్గారని, ఆయినప్పటికీ ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవజీవన్, డాక్టర్ భవాని ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ చేబోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా తణుకు జిల్లా ఆసుపత్రి ఎఆర్‌టి సెంటర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి పోకిన వారు సమయానికి మందులు వాడుతూ మంచి ఆహారం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్‌సి సెక్షన్ కోర్టు కు వెంకటేశ్వర్లు, ఎఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ సుంకవల్లి రామకృష్ణ పాల్గొన్నారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్ఎస్ఎస్ విభాగాల వారు ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఏటా 15 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధికి మందులు వాడుతున్నారన్నారు. కార్యక్రమంలో యు.లక్ష్మీసుందరిబాయి, జి.రమ్య, సిహెచ్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆకివీడు : ఎయిడ్స్ డే సందర్భంగా దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ రోగులకు 25 మందికి నిత్యావసరాలు అందజేశారు. స్థానిక వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎయిడ్స్ రోగులకు, వృద్ధులకు దుప్పట్లు, పౌష్టికాహారం, సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ గీత రామకృష్ణ ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు. ఆకివీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐ భీమవరం జెడ్పి హైస్కూల్లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి అంశంపై పోస్టర్ పోటీ కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు.

పాలకోడేరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పాలకోడేరు ప్రాథమిక వైద్యాధికారి సిహెచ్.రంగనాయుడు ఆధ్వర్యంలో పోలీసుల సిబ్బందితో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రంగనాయుడు మాట్లాడారు. అనంతరం ఎయిడ్స్ గురించి బాధ్యత గల పౌరునిగా సమాజంలో అందరికీ అవగాహన కలిగిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా వైద్యులు స్వర్ణ నిరంజని, సిహెచ్ సత్యనారాయణ, అమ్మాజీ, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, రాణి, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, శ్రీను, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

సర్వే చేస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పాలకోడేరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యానారాయణ రాజు అన్నారు. కొండేపూడిలో రీసర్వే పనులను గురువారం ఆయన ప్రారంభించారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావుతో పాటు గ్రామ సర్వేయరు రీ సర్వేలో పాల్గొని భూముల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సూర్యానారాయణ రాజు మాట్లాడుతూ రీ సర్వే ఎక్కడా లేని విధంగా ఇక్కడ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఈ సర్వేలో వివిధ రకాల భూములను గుర్తించడంతోపాటు సంబంధించిన యాజమాన్య హక్కును కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత వాటికి సంబంధించిన పత్రాలు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెనుగొండ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. వడలి గ్రామంలో 87వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నరసాపురం కళాశాల గాంధీ అధ్యయన కేంద్ర డైరెక్టర్ పులపర్తి వెంకటసుబ్బారావు అన్నారు. గురువారం సాయంత్రం మొగల్తూరులోని వివేకా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గాంధీజీ సిద్ధాంతాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలు గాంధీజీ సిద్ధాంతాలను అనుసరిస్తున్నాయన్నారు. నరసాపురం వైఎన్ కళాశాల పీజీ ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ కె.సుశీల్ పాల్ మాట్లాడుతూ మహోన్నత శక్తి గాంధీజీ అన్నారు. సమావేశం అనంతరం వారిని పాఠశాల ప్రిన్సిపల్ యు.గీతా రాంబాబు, సెక్రటరీ కరస్పాండెంట్ యు.రాంబాబు ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రేలంగి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఇరగవరం

తుమ్మలపల్లి మాణిక్యం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో రేలంగికి చెందిన 9వ తరగతి చదువుతున్న బి.హేమదుర్గాలక్ష్మి, వై.నిషాంత్ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో కబడ్డీ, టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పిపి ఛైర్మన్ ఎం.యేసు, రేలంగి గ్రామ సర్పంచి సిహెచ్ స్వరాజ్యం, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది అభినందలను తెలియజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు

జనసేన బలోపేతానికి కృషి చేయాలని ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జనసేన ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాలు గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షులు ఏరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పెదఅమిరంలో జైన దేవాలయాన్ని సందర్శించిన అనంతరం బొండాడ, బొండాడ పేట గ్రామాల జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జనసేన బిసిలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. పార్టీని ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత తమ వంతు కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. అనంతరం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. బొండాడ గ్రామ అధ్యక్షులుగా హనుమ, బొండాడ పేట గ్రామ అధ్యక్షులుగా లింగేశ్వరరావును ప్రకటించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల మండల ఉపాధ్యక్షులు ఒగిరాల రాజేష్, ప్రధాన కార్యదర్శులు చావాకుల వీరభద్రరావు (నాని), ఇరంకి జగన్, ఆరేటి దిలీప్, దేశంశెట్టి మధు, ఎ.సత్యనారాయణ, ఈది డైమండ్, నిమ్మల రాము, గ్రామాధ్యక్షులు బండారు సోమేశ్వరరావు, నూకల భోగేంద్ర, లంక సురేష్, కె.రాంబాబు, జి.సత్యనారాయణ, గనిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

రూ.కోటితో నిత్యాన్నదాన భవనం

జెడ్పి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం శాశ్వతంగా నిర్వహించేందుకు కోటి రూపాయలతో భవనం నిర్మిస్తున్నట్లు జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రకటించారు. పెదగోపవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసం నెల రోజులు 40 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. రూ.13.5 లక్షల విరాళాలు వచ్చాయని తెలిపారు. హుండీ కానుకలు అభిషేకాల టిక్కెట్లు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా మొత్తం రూ.49 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యర్ల సూర్యనారాయణ, ట్రస్టీలు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి రేవ వద్ద ఉన్న నాగదేవత ఆలయ ప్రాంగణంలో గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్న సిఐటియు 16 రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నేత నాగిశెట్టి గంగాధర్ కోరారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ ఈ సభకు వ్యాపారులు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, షేక్ బాదుషా, గెద్దాడ శ్రీను, ఆర్.వెంకటేశులు, శీలం ఏసు, పాల్గొన్నారు.

కందకు కాసిన కాయలను చూపుతున్న కృష్ణంరాజు

కందకు.. కాయలు!

ప్రజాశక్తి - పోడూరు

కొమ్ముచిక్కాల గ్రామంలో కంద మొక్కకు ఈతకాయల మాదిరిగా కాయలు కాశాయి. దీంతో చుట్టుపక్కల వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కొమ్ము చిక్కాల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచి యరకరాజు వెంకటరామ కృష్ణంరాజు తన పొలంలో ఎకరా కంద పండిస్తూ ఉంటారు. ఈ సందర్భంలోనే ఏడాదిన్నర క్రితం చిన్న తీసి కంద ముక్క వేశారు. ప్రస్తుతం ఆ కంద సుమారు 5 కిలోల బరువుతో పాటు పొడవాటి ఈత కాయల మాదిరిగా గెల వేసి సుమారు 300 కాయలు కాసింది. చుట్టుపక్కల రైతులు దీన్ని చూసేందుకు వస్తున్నారని ఆయన తెలిపారు.

జనసేన నేత చిన్నా దాతృత్వం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం నియోజకవర్గ జనసేన నాయకుడు చాగంటి మురళీకృష్ణ (చిన్నా) దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం సీతారామపురం వద్ద పూల వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అటుగా వెళుతున్న జనసేన నాయకుడు చాగంటి చిన్న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వ్యక్తిని చూసి చలించిపోయారు. అంబులెన్స్ రావడం ఆలస్యమవడంతో చిన్న తన కారులోనే ఆ వ్యక్తిని నరసాపురంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్య సహాయానికి ఆర్థిక సహాయం చేసినట్లు చిన్న అనుచరులు తెలిపారు. దీంతో పలువురు వర్షం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు
O.S.No. 326/2021

విటీకి:
విజయాబ్యాంకు, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, తణుకు ...వాది

మరియు

1) రేలంగి పద్మావతి
2) రేలంగి నరసింహమూర్తి ...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషను ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంథము ది.08-12-2022వ తేదీకి వాయిదా ఉన్నది. కావున సదరు తేదీకి మీరు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావల్సిందిగా ఈ ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది. అట్లు హాజరు కానిచో సదరు గ్రంథము మీ పరోక్షములో తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
01-12-22. అడ్వకేట్, తణుకు.